క్లుప్తంగా

ఆస్తిపన్ను చెల్లించండి

బండ్లగూడ: ప్రజలంతా తమ ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఏప్రిల్ 30లోగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30 వరకు ఆస్తిపన్ను చెల్లించేందుకు అవకాశం ఇచ్చిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఆస్తి పన్నును చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు.

క్లాంప్ ఏర్పాటు చేశారు



రబ్బర్ చెప్పు తొలగించి క్లాంప్ ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రాజేంద్రనగర్: ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారుల తీరుపై 'సాక్షి' రాజేంద్రనగర్ జోన్‌లో శనివారం 'క్లాంప్‌కు బదులు చెప్పు అమర్చారు' పేరుతో ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. అత్తాపూర్ డివిజన్, కేశవనగర్ కాలనీలో పర్యటించిన అధికారులు వైరు, కేబుల్‌ను అనుసంధానం చేసిన స్తంభాన్ని పరిశీలించారు. అనంతరం క్లాంప్ ఏర్పాటు చేసి రబ్బర్ చెప్పును తొలగించారు. ఈ సందర్భంగా స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తమ గృహ ఉపకరణాలు పాడయ్యాయని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. కాలనీలోని వీధి దీపాలు కాలిపోయాయని ఇదే విషయమై 'సాక్షి' దృష్టికి తీసుకురావడంతో సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కిక్‌బాక్సింగ్‌లో సత్తాచాటిన సాక్షి గోస్వామి



సాక్షి గోస్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం పట్టుదలతో కష్టపడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లిలోని బ్యాడ్మింటన్ స్టేడియంలో స్టేట్ లెవల్ కిక్‌బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సాక్షి గోస్వామి గోల్డ్, సిల్వర్ పతకాలను సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆమెకు పతకాలు అందజేసి సత్కరించారు.

ఆల్ ఇండియా షాహీ ఇమామ్ జనాబ్‌కు సత్కారం



సాక్షి, సిటీబ్యూరో: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆల్ ఇండియా షాహీ ఇమామ్ జనాబ్ డాక్టర్.ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇల్యాసీని ఎన్‌ఎస్‌ఐ గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ నవాబ్ షేక్ ఇబ్రహీం సత్కరించారు. మణికొండ జాగీర్ ల్యాంకో హిల్స్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఇండియా ట్యునీషియా ట్రేడ్ కౌన్సిల్ కమిషనర్ ఇబ్రహీం, జాతీయ మానవ హక్కుల జాతీయ కార్యదర్శి కబీర్ ఖాన్, బీఆర్‌ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ ఫతే అఫ్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్టార్టప్‌లతో ముందుకు రావాలి

గచ్చిబౌలి: టీఎన్‌జీఓకాలనీ ఫేజ్–2లో తెలంగాణ కట్స్ నూతన ఔట్‌లెట్‌ను ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. యువత స్టార్టప్‌లతో ముందుకు వచ్చి ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం వారిని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ కట్స్ వ్యవస్థాపకుడు బండి హరిప్రసాద్‌గౌడ్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఆసరా' కోసం ఆశగా...

- పేదల నిరీక్షణ
- వివరాల నమోదులో తప్పులు
- బతికున్నా.. చనిపోయినట్లు నమోదు
- అర్హుల ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం, శంషాబాద్.

శంషాబాద్ రూరల్: అర్హుల వివరాల నమోదులో తప్పులు.. దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం.. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయలోపం కారణంగా 'ఆసరా' పింఛన్లు మంజూరుకు పేదలు నానా కష్టాలు పడుతున్నారు. మంజూరైన పింఛన్ల డబ్బులు లబ్ధిదారులకు అందుతున్నాయో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పింఛన్ల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తప్పుడు వివరాల నమోదుతో..

పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తుల్లో అర్హుల వివరాలు తప్పుగా నమోదు చేయడంతో అర్హతలు ఉన్నా వారికి పింఛన్లు మంజూరు కావడం లేదు.

- జూకల్‌కు చెందిన కుమ్మరి వెంకటమ్మ భర్త వెంకటేష్ 2018 నవంబర్‌లో మృతి చెందాడు. దీంతో ఆమె వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే సిబ్బంది వివరాలు తప్పుగా నమోదు చేయడంతో ఆమె చనిపోయినట్లు ధృవీకరించుకున్న అధికారులు పింఛను మంజూరు చేయలేదు. దీంతో ఎలాంటి ఆధారం లేని ఆమె దినసరి కూలీగా జీవనం సాగిస్తోంది.
- ముచ్చింతల్‌కు చెందిన బీర్ల మణెమ్మ భర్త సత్తయ్య 2018లో మృతి చెందాడు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆమెకు వివిధ కారణాలతో పింఛన్ మంజూరు చేయకుండా కాలయాపన చేశారు. చివరకు చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు చేయడంతో మణెమ్మ కిరోసిన్ బాటిల్‌తో గ్రామసభకు వచ్చి తన గోడు వెళ్లబోసుకుంది. న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళనకు దిగింది.

సమన్వయ లోపం..

అర్హులైన పేదలు పింఛన్ దరఖాస్తులను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందజేస్తుంటారు. వీటిని ఎప్పటికప్పుడు ఎంపీడీఓ కార్యాలయం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి. కానీ సిబ్బంది

- నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్న జాప్యంతో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోంది. పంచాయతీల వారీగా వస్తున్న దరఖాస్తుల వివరాలు ఎంపీడీఓ కార్యాలయానికి ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు ఇవ్వడంలేదని సమాచారం. వీటిపై అధికారులు కూడా సమీక్షించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

తపాలా శాఖ నుంచి డబ్బుల పంపిణీ..

పింఛన్ దారులకు తపాలా శాఖ నుంచి డబ్బులు పంపిణీ జరుగుతుండగా.. ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల వివరాలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పిల్లోనిగూడకు చెందిన కొందరు లబ్ధిదారులకు పింఛన్లు మంజూరైనప్పటికీ వారికి సమాచారం అందకపోవడం గమనార్హం. బాధితులు పలుమార్లు అధికారులను సంప్రదించగా వీరికి అప్పటికే పింఛన్లు మంజూరైనట్లు గుర్తించి లబ్ధిదారులకు సమాచారం అందించారు. అప్పటికే వారికి పింఛను మంజూరై రెండు నెలలు గడిచినట్లు సమాచారం. తపాలాశాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది మధ్య కూడా సమన్వయం లేక అర్హులైన వారికి ఆసరా పింఛన్లు అందకుండా పోతున్నాయి.

మండలంలో 5164 పింఛన్ల పంపిణీ

మండల పరిధిలోని 27 పంచాయతీల్లో 5164 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఓఏపీ కింద 1882 మందికి, వితంతువులకు 2343, దివ్యాంగులకు 731 మందికి, కల్లుగీత కార్మికులకు 48 మందికి, నేత పని చేసే ఒకరికి, ఒంటరి మహిళలకు 159 మందికి ఆసరా పింఛన్లు అందుతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం
ప్రతిభ, సూపరింటెండెంట్

పంచాయతీలకు వచ్చే ప్రతి దరఖాస్తు వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటున్నాం. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకురావచ్చు. ముచ్చింతల్‌లోని బీర్ల మణెమ్మకు ఇటీవల పింఛను మంజూరు చేయించాం. అలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

బీజేపీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

రాజేంద్రనగర్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. రాజేంద్రనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ హటావో దేశ్ బచావో పేరుతో ఈ నెల 14 నుంచి ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. ప్రధాని మోదీ పబ్లిక్ రంగ సంస్థలను అమ్ముకుంటూ ఆదానీ అంబానీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. సంస్కరణల పేరుతో వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేశాడన్నారు. సీపీఐ కంట్రోల్ కమిషన్ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నియోజకవర్గ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఎం.ఏ.రియాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి నర్రగిరి, గండిపేట మండల కార్యదర్శి బాబురావు, యాదగిరి, రాజు, పాండు, సత్యనారాయణ, ఆనంద్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



కోకాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మణికొండ: ఏసుక్రీస్తుకు సిలువ వేసే ముందు మానవాళి రక్షణ కొరకు ఆయనను ఊరేగించిన రోజును పురస్కరించుకుని క్రిస్టియన్లు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. మణికొండ సేవియర్స్ లూథరన్ చర్చి, ది లైఫ్ చర్చి, ఖానాపూర్ బాపిస్టు చర్చి, కోకాపేట యేసు ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఏసు క్రీస్తుకు జయం చెపుతూ వీధుల్లో పిల్లలు, పెద్దలు మట్టలు చేతిలో పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు మల్లెల ప్రభాకర్, కె.డేవిడ్ ప్రకాశ్, రామకృష్ణ మాట్లాడుతూ నీతి పరుడు, రక్షణ గల వాడు అయిన ఏసు క్రీస్తును తమ హృదయాల్లోకి ఆహ్వానించి ఆయనను కొలవాలన్నారు. కార్యక్రమంలో మణికొండ సేవియర్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ సావ అబ్రహం, సంఘ అధ్యక్షుడు సామ్యూల్ శుభకర, కోశాధికారి ఆదిరాజు, ప్రతినిధులు సుమన్, జాకబ్ రాజు, మాధురినటరాజ్, స్మిత రాజేశ్, మెర్సీరాజ్, శృతి, షేకినా డానియల్, ఝాన్సీ ఉదయ్‌లు, ఖానాపూర్‌లో మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మాజీ సర్పంచ్ నర్సింహా



మణికొండ లూథరన్ చర్చిలో..

బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం పెద్దషాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. రూ.30 కోట్ల ఎమ్మెల్యే నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువలు, బీటీ రోడ్లు వేయించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, జడ్పీటీసీ తన్వీ, ఎంపీపీ జయమ్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

శంషాబాద్: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమబెంగాల్‌కు చెందిన బిబిషన్ అతడి భార్య మనీష (24) వారం రోజుల క్రితం కూరగాయలు కొనుగోలు చేసేందుకు శంషాబాద్ మార్కెట్‌కు వచ్చారు. బిబిషన్ చికెన్ తీసుకుని వస్తాను మార్కెట్ వద్దే కూర్చోమని చెప్పాడు. అతను తిరిగి వచ్చి చూసే సరికి మనీష కనిపించకపోవడంతో ఆమె కోసం గాలించాడు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ ఉండడంతో ఆదివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారులతోనే అభివృద్ధి



కోకాపేటలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: రహదారుల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట 5వ వార్డు కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. తన వార్డు పరిధిలో రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిధుల లభ్యతను బట్టి అన్ని వార్డుల్లో సాధ్యమైనన్ని ఎక్కువ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నిర్మాణాల్లో అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

చలివేంద్రాలతో సమాజసేవ



లాలమ్మగార్డెన్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: సేవా సంస్థలు, సహృదయులు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలతో సమాజానికి మేలు జరుగుతుందని, అలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని లాలమ్మ గార్డన్‌లో ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనుషులకు సేవ చేస్తే దేవుడికి సేవ చేసినట్లే అన్నారు., సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేసే వారిని ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, నాయకులు బి. ముత్యాలు, అసోసియేషన్ అధ్యక్షుడు డి.వేణుమాధవ్, కార్యదర్శి డి. భానుచందర్, కోశాధికారి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్నంపూర్ చెరువులో ఫ్లోటింగ్ బైక్



నెక్నంపూర్ చెరువులో ప్రారంభించిన ఫ్లోటింగ్ బైక్

మణికొండ: చెరువులో చేరే మలినాలతో జీవరాశులకు ఇబ్బంది కలగకుండా వాటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేసేందుకు గాను మణికొండ మున్సిపాలిటీ నెక్నంపూర్ చెరువును దత్తత తీసుకున్న ధృవాన్ష్ ఎన్‌జీవో సంస్థ మరో కొత్త యంత్రాన్ని ప్రవేశపెట్టింది. గతంలోనే చెరువు నీటిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచే క్రమంలో ఫౌంటేన్, ఫ్లోటింగ్ ఐలాండ్ తదితర ప్రయోగాలు చేసినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో సదరు సంస్థకు మున్సిపాలిటీలు, హెచ్‌ఎండీఏ ఇస్తున్న నిధుల్లో కోత పెట్టారు. ఈ నేపథ్యంలో కొత్తగా చెరువులో తిరుగుతూ నీటిని శుద్ధి చేసే ఫ్లోటింగ్ బైక్‌ను ప్రవేశపెట్టారు. పెగాసిస్ సిస్టమ్స్ సంస్థ దీనిని అందజేసినట్లు ధృవాన్ష్ ప్రతినిధి మధుళిక చౌదరి తెలిపారు.

10వ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

రాజేంద్రనగర్ ఎంఈవో రామిరెడ్డి

రాజేంద్రనగర్: 10వ తరగతి పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు రాజేంద్రనగర్ మండల ఎంఈవో రామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన సర్కిల్ పరిధిలోని పలు సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని మొత్తం 19 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారున్నాయా సెంటర్లల్లో 4400 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. 13వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రానికి సెల్‌ఫోన్‌లు, డిజిటల్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకు రాకూడదన్నారు. అన్ని సెంటర్లల్లో సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఆదివారం ఆయా సెంటర్లను పరిశీలించినట్లు తెలిపారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని విద్యార్థులు పరీక్షలు సజావుగా రాసేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళా నాయకులు, కార్యకర్తలు.

రాజేంద్రనగర్: దేశ భవిష్యత్తును నిర్ణయించేది నవ యువతేనని భారతీయ జనతా పార్టీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు ఆకుల విజయ, అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఐఐటీ స్టడీ సెంటర్‌లో రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో నవ యువ ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు పద్మావతి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, గీతారెడ్డి, డాక్టర్ మాలతి, లక్ష్మి, కుసుమ, నాగమణి, అత్తాపూర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమా, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు వి.లక్ష్మి, తిరుపతమ్మ, జయంతి, కవిత, స్వప్న, సీమ తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చిల్లో ఆదివారం మట్టల ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాజేంద్రనగర్ మన్నాఫుల్ గాస్పెల్ చర్చ్‌లో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతిల ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు మట్టలు పట్టుకుని క్రీస్తు విజయోత్సవ గీతాలను ఆలపించారు.

సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలి



సంస్కృతిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: బాల్యంలోనే చిన్నారులకు సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత శక్తి సంయోజక్ పద్మశ్రీ అన్నారు. ఆదివారం ఉప్పర్‌పల్లి చైతన్య విల్లాస్ కాలనీలోని రామాలయంలో బాల సంస్కార శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల బాలికలకు ఆటలు, పాటలతో సంస్కృతి పదాలు నేర్పిస్తున్నామన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరిచి పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్నారన్నారు. ఇది భవిష్యత్తులో తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఆలయంలో ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కనకదుర్గ, వెంకటలక్ష్మి, శారదా, కామేశ్వరి, వనిత తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కట్ చేసి పన్నులు వసూలు చేస్తారా?

- మున్సిపల్ మేనేజర్‌పై పలు కాలనీల వాసుల ఆగ్రహం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- ఆల్‌కాలనీస్ ఫెడరేషన్‌లో తీర్మానం



సమావేశంలో పాల్గొన్న ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ కార్యవర్గ ప్రతినిధులు

మణికొండ: ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు తొలగించి పన్నులు వసూలు చేసిన మున్సిపల్ మేనేజర్ మల్లారెడ్డిపై ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో పాటు ఇంటి పన్ను మదింపు విధానంలో ప్రస్తుతం కడుతున్న పన్నును వంద శాతం దాటి పెంచితే హైకోర్టును ఆశ్రయించాలని తీర్మానం చేసింది. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ రెసిడెన్షియల్ అసోసియేషన్స్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం పుప్పాలగూడ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ కమ్యూనిటీహాల్‌లో అధ్యక్షుడు డి.సీతారాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిత్రపురి కాలనీలో మున్సిపల్ మేనేజర్ ఇంటి విద్యుత్ కనెక్షన్లను తొలగించి చేసి మరీ ఇంటి పన్నులు వసూలు చేయటంపై సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. మున్సిపాలిటీ పరిధిలోని వార్డు కమిటీలు, పార్కు కమిటీల కూర్పు వాటి నిర్వహణపై మున్సిపల్ చట్టాన్ని అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో చేపట్టిన రోడ్ల వెడల్పు పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వాటితో పాటు ఫుట్ పాత్ ఆక్రమణలను పూర్తిగా తొలగించాలన్నారు. పందెన్‌వాగు నాలా ఆధునికీకరణను పంచవటి కాలనీ నుంచి నెక్నాంపూర్ చెరువు వరకు చేపట్టాలని కోరారు. ప్రతి ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో కాలనీల్లో పర్యటించి సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, కోశాధికారి బాబురావు, అలకాపూర్ టౌన్‌షిప్ అధ్యక్షుడు రామయ్య, కార్యదర్శి మోహన్‌లతో పాటు పలు కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.